క్లుప్తంగా

మైనర్లను పనులకు పంపించొద్దు

పెద్దకొత్తపల్లి: మైనర్లను పనులకు పంపించొద్దని కోనేరు స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్‌లో బాలిక 5వ తరగతి వరకు చదివి బడి మానేసింది. ఆదివారం బాలిక తల్లిదండ్రులకు శ్రీనివాసులు చదువు ప్రాధాన్యాన్ని వివరించి బాలికను పాఠశాలకు పంపించేవిధంగా ఒప్పించారు.

దుస్తులు అందజేత

తెలకపల్లి: మండల కేంద్రంలో భిక్షాటన చేస్తున్న అంధుడు చంద్రయ్యకు వంద్యాల శ్రీణిక తన తండ్రి సీఎల్‌ఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డితో కలిసి దుస్తులు అందజేశారు.

వైద్యుడు జంగిరెడ్డికి నివాళి



అచ్చంపేట రూరల్: దివంగత డాక్టర్ మంద జంగిరెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం బొల్గట్‌పల్లి గేటు సమీపంలో లెనిటీ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మాజీ ప్రజాప్రతినిధులు మనోహర్, తుల సీరాం, రామకృష్ణారెడ్డి, రామనాథం జంగిరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మహేష్, రాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు చేయూతనివ్వాలి



తాడూరు: ప్రత్యేక తెలంగాణ సాధనలో ప్రముఖ పాత్ర వహించిన విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వం పరంగా చేయూతనివ్వాలని విశ్వబ్రాహ్మణ సంఘం మండల నాయకులు భాస్కరాచారి, కృష్ణమాచారి, అనంతరాములు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో నిర్వహించిన మండల విశ్వబ్రాహ్మణుల సమావేశంలో మాట్లాడారు. ఆయా బ్యాంకుల ద్వార రుణాలు అందజేయాలని, 50 ఏళ్లు పైబడిన వారందరికి పింఛన్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆయా గ్రామాల విశ్వబ్రాహ్మణులు ఆంజనేయులు, తిరుపతాచారి, రామాచారి, బాలకృష్ణ, మల్లాచారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మాసూంబాబా ఉత్సవాలు



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో మాసూంబాబా దర్గా ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి 10 గంటలకు బుర్హషరీఫ్‌కసీఫాఖానీ దర్గా నుంచి గంధాన్ని ఊరేగింపుగా ఖాన్‌కోహీమాసుమీ చిన్న దర్గా మీదుగా రాత్రి 1 గంటకు మాసూంబాబా దర్గా వద్దకు చేరుకుంటుందని కమిటీ పీఠాధిపతి సైయ్యవలీమెహీమొద్దీన్ తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్, అచ్చంపేట, మహబూబ్‌నగర్, కడప ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

పోడుభూముల సమస్యలు పరిష్కరించాలి



పాన్‌గల్: జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గిరిజన కార్పొరేషన్ పెండింగ్ రుణాలు మంజూరు చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహించిన గిరిజన సంఘం విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో పోడు భూముల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గిరిజనులు దాదాపు 1500 ఎకరాల పోడు భూములు సాగు చేసుకుంటున్నారని, ఇందులో కేవలం 250 ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చారన్నారు. మండలంలో దాదాపు 200 ఎకరాలు గిరిజనులు పోడుభూములు సాగుచేసుకుంటున్నా.. అందులో ఒక్కరికి కూడా పట్టాలు ఇవ్వకపోవడం గిరిజనులపై వివక్ష చూపుతున్నారన్నారు. ఇప్పటికీ ఒక్కరికి కూడా రుణాలు మంజూరు కాలేదన్నారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు బాబునాయక్, రవినాయక్, బాలునాయక్, సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన ప్రత్యేక పాలన

- కాల్వల్లో పేరుకుపోయిన చెత్త
- గుంతలమయంగా రోడ్లు



కోడేరులో కాల్వలో పేరుకున్న మురుగు, చెత్త



నాగులపల్లి బురదమయంగా ఉన్న ప్రధాన రహదారి

కోడేరు: సర్పంచ్ పాలన ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. అప్పటినుంచి గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు గ్రామాల వైపు చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీరు సమస్యలు పరిష్కరించడం అధికారులు విఫలం అయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గుంతలమయంగా మారిన రోడ్లు..

కోడేరు, నర్సాయిపల్లి, రాజాపూర్, నాగులపల్లి, మాచ్‌పల్లి గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాలకు గ్రామాల్లోని అంతర్గత రోడ్లన్ని గుంతలుమయంగా మారి వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఈగలు, దోమల బెడద వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామ ప్రత్యేకాధికారులు వైద్య సిబ్బంది పట్టించుకొని గ్రామాల్లో మురుగు నిల్వ ఉండకుండా చూడాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా వాటర్ ట్యాంక్‌లు

జనవరిలో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. ఫిబ్రవరిలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ ప్రత్యేకాధికారులను నియమించింది. మండలంలో 22 గ్రామ పంచాయతీలకు రెండు గ్రామ పంచాయతీలను కలిపి ఒక్క ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేశారు. మొత్తం 11 మందిని నియమించగా వారు కేటాయించినా గ్రామాలకు వెళ్లకపోవడంతో పారిశుద్ధ్య సమస్య అస్తవ్యస్తంగా తయారైంది. మండలంలో మొత్తం 43,186 జనాభా ఉండగా గ్రామాలకు ప్రత్యేక అధికారులు సరైన న్యాయం చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు.

కాల్వలు శుభ్రం చేయాలి



గ్రామంలో మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. కాల్వలను వెంటనే శుభ్రం చేయాలి. గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.

– జంబుల బుచ్చారెడ్డి,
సింగిల్‌విండో మాజీ చైర్మన్, నర్సాయిపల్లి

పారిశుద్ధ్య పనులు చేపడుతాం



గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపడుతాం. పంచాయతీ కార్యదర్శుల, ప్రత్యేకాధికారల సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తాం. వాటర్ ట్యాంక్‌లను వెంటనే శుభ్రం చేస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

– శ్రీనివాసులు, ఎంపీడీఓ, కోడేరు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాగర్‌కర్నూల్‌లో సమావేశమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థులు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1992–94 ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పూర్తి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో జరిగిన సన్నివేశాలను గుర్తుచేసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్న మిత్రులకు సహాయం చేసేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ విద్యా సంస్థల్లో 2004– 06 సంవత్సరంలో ఇంటర్మీడియేట్ చదివిన విద్యార్థులు ఆదివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి అధ్యాపకులను శాలువాలతో, మెమెంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నర్సింహాచారి, నారాయణరెడ్డి, సత్యం, వెంకటయ్య, మోహన్‌తోపాటు పూర్వ విద్యార్థులు, పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 2000– 01 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు. గురువులు రఘునందన్, మల్లయ్య, యాదయ్యగౌడ్, సుగుణ, ఆంజనేయులు, పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



కళాకారులతో ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: పట్టణంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు మండలంలోని 24 గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. మండలంలోని తాండ్ర గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు వెళ్లారు.

చారకొండ: కల్వకుర్తిలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ఆదివారం మండల కేంద్రంతోపాటు జూపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి తదితర గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యం



రహదారి పక్కన ఎండిన మొక్కలు

చారకొండ: వన మహోత్సవంలో భాగంగా మండలంలోని సిర్సనగండ్లలో దేవాలయానికి వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా దాదాపుగా 300 మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కాని గుంతలు తీయకపోవడంతో మొక్కలు రోడ్డుకు ఇరువైపులా ఉంచారు. వారం రోజులుగా వాటి సంరక్షణ లేకపోవడంతో మొక్కలు వాడిపోయాయి. రూ.లక్షలు విలువ చేసే మొక్కలు ఎండిపోవడానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చాకలి ఐలమ్మ జీవితం ఆదర్శం



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాయకులు

వంగూరు: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ జీవితం అందరికి ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని పోల్కంపల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమికోసం, భుక్తికోసం ఐలమ్మ ఎన్నో ఉద్యమాలు చేశారని పేర్కొన్నారు. పోల్కంపల్లి గ్రామ అభివృద్ధి కృషి చేస్తానన్నారు. చాకలి, గౌడ్ కులస్తుల కమ్యూనిటీ హాల్స్‌ను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఉప్పల వెంకటేష్, రజకసంఘం నాయకులు అంకు సురేందర్, కృష్ణయ్య, ఏపీ మల్లయ్య, సింగర్ గంగ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీగా పదోన్నతి ప్రతాప్‌కు సన్మానం



అచ్చంపేట: పట్టణానికి చెందిన బల్మూరి ప్రతాప్‌కుమార్ హైదరాబాద్‌లో పోలీస్ ఇంటిలిజెన్స్ ఏసీపీగా పనిచేస్తూ ఏఎస్పీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయన మిత్రులు పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో సన్మానించారు. పబ్లిక్ క్లబ్ అధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్‌రెడ్డి, మండికారి బాలజీ, మేడిశెట్టి రమేష్, పులిజాల శ్రీనివాసులు, మోక్తాల రేణయ్య, కేతేపల్లి వెంకటేష్, పోకల ప్రవీణ్‌కుమార్, నల్లపు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీఎం ప్రకటనపై హర్షం

కల్వకుర్తిరూరల్: సీఎం రేవంత్‌రెడ్డి చదివిన పాఠశాలకు ఆదివారం నిర్వహించిన సభలో వరాలజల్లు కురిపించారు. మండలంలోని తాండ్ర గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సీఎంకు విన్నవించగా ఆయన స్పందించి రూ.5 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ముందస్తు అరెస్టు



వెల్దండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను దృష్టిలో ఉంచుకొని మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ యూత్ నాయకులను ముందస్తుగా ఆదివారం పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు యాదగిరి, గుత్తి బాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుతాం

తెలకపల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు అన్నాడు. ఆదివారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా సమస్యల అధ్యయన యాత్రంలో భాగంగా ఆయన 4వ వార్డులు పర్యటించారు. డ్రెయినేజీని సీపీఎం బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి విషపు జ్వరాలబారిన పడి అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్, పారిశుద్ధ్యం సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం అయ్యిందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నందిపేట భాస్కర్, కార్యవర్గ సభ్యులు గోపస్ లక్ష్మన్, సీనియర్ నాయకులు విజయగౌడ్, కాశన్న, రామకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.



మురుగుకాల్వను పరిశీలిస్తున్న నాయకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండంలో సీపీఎం బృందంతో కలిసి మండల కార్యదర్శి శివవర్మ సందర్శించారు. గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై వారు అధ్యయనం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలపీరు, చంద్రునాయక్, తారాసింగ్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానది తీర ప్రాంతాలకు జలకళ



సోమశిల వద్ద పుష్కరఘాట్లపైకి చేరిన కృష్ణానది నీరు

కొల్లాపూర్: ఎగువ నుంచి వరద జలాల విడుదలతో శ్రీశైలం బ్యాక్ వాటర్ సామర్థ్యం రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో కృష్ణానది తీర ప్రాంతాలు జలకళ సంతరించుకోంది. నది అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. ఆదివారం సోమశిల, మంచాలకట్ట ప్రాంతాల్లో పర్యాటకుల సందడి కనిపించింది. తీర ప్రాంతాల్లోని పుష్కర ఘాట్ల పైకి నీళ్లు చేరింది. ఇప్పటికే సంగమేశ్వరాలయం నదినీటిలో మునగగా సోమశిల సమీపంలోని మసీదు నీట మునిగింది. మంచాలకట్ట వద్ద నదీ సముద్రాన్ని తలపిస్తోంది.

ప్రమాదకరంగా ప్రధాన రహదారి



సీతారాంపూర్ వద్ద ప్రధాన రహదారి దుస్థితి

బల్మూర్: మండలంలోని అచ్చంపేట–బల్మూర్ ప్రధాన రహదారిలోని సీతారాంపూర్ బస్‌స్టేజీ వద్ద వర్షం తాకిడికి రోడ్డు కొట్టుకు పోయి గుంతలమయంగా మారింది. బల్మూర్, లింగాల మండలాలకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రహదారి గుండా వెళ్తున్నా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో నుంచి వచ్చే వర్షం నీరుతో పాటు మురుగు కూడా రోడ్డుపై ప్రవహించడంతో ఐదేళ్లుగా బీటీ ఆనవాల్లే లేకుండా పోయాయిన స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయైన రోడ్లతో రాత్రివేళ వాహనాదారులు ప్రమాదాల బారిన పడి గాయపడిన ఘటనలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ, ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన



ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అమ్రాబాద్: మండల కేంద్రంలో ఉన్న వసతి గృహాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని బీజేపీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా సందర్శించి సమస్యలు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో స్నానపు గదులల్లో నీటి వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అధికారులు పట్టించుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వసతులు కల్పించడంతో కూడా నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థులు హాస్టళ్లలో ఎలా ఉంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, మండల అధ్యక్షుడు గోలిరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సైదులు, శివ, సతీష్ ఉన్నారు.

పాఠశాలకు పూర్వవైభవం తీసుకొద్దాం



మన్ననూర్: పాఠశాలకు పూర్వవైభవం తీసుకొద్దామని భారత్ విద్యా ఉద్యమం వ్యవస్థాపకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్ కోరారు. అమ్రాబాద్ మండలం మాధవానిపల్లిలో నిర్వహణలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతుండటంతో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల బలోపేతానికి అందరు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. కొంత కాలనికి గ్రామంలోని పాఠశాల మూసివేసే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ విద్యార్థుల దృష్ట్యా పాఠశాలను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. అదే విధంగా పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా ఆదుకునేందుకు ముందుకువచ్చే విధంగా సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ పూలే సంఘాల నాయకులు, పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు మల్లయ్య, రామస్వామి, పర్వతాలు, రఘుపతి, లింగం, మోహన్, వెంకటేష్, శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా ఓహెచ్‌ఆర్ ట్యాంకు పరిసరాలు



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని బొందలపల్లిలో ప్రజల తాగు నీటి అవసరాల కోసం నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ట్యాంక్ కింద పశువులను కట్టివేయడంతో నిత్యం పేడ, మూత్రం వ్యర్థ పదార్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ముసురు వర్షాలకు నీరు నిలిచిపోవడంతో దోమలు, ఈగలు ఆవాసాలుగా ఏర్పరుచుకున్నాయయి. తాగునీరు కూడా కలుషితమవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. రోగాలబారిన పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్త ంచేస్తున్నారు. అధికారులు స్పందించి ట్యాంక్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

బహిరంగ ప్రకటన

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

బహిరంగ ప్రకటన

Sd/- K. CHANDRA MOULI
Panel Advocate & Legal Advisor
Mahabubnagar, Cell : 9440330760

